క్లుప్తంగా

శ్మశాన వాటికలో అభివృద్ధి పనుల పరిశీలన


శ్మశాన వాటికను పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీధర్

గోపాలపట్నం: శ్మశాన వాటికలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆదేశించారు. జీవీఎంసీ 52వ వార్డు కరాసా హిందూ, క్రిస్టియన్ ముస్లిం శ్మశాన వాటికలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన సోమవారం పరిశీలించి, మాట్లాడారు. మూడు మతాలకు సంబంధించిన శ్మశానం ఒకేచోట ఉండడం అరుదని, దీనిని సుందరంగా తీర్చిదిద్ది, సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, డీఈ ఏడుకొండలు, వార్డు సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా అమావాస్య తిరువీధి


సింహగిరి మాడ వీధుల్లో స్వామికి తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: అమావాస్య పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం విశేషంగా తిరువీధి జరిగింది. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అలంకరించి పల్లకిలో అధిష్టంపజేసి సింహగిరి మాడవీధుల్లో సాయంత్రం విశేషంగా తిరువీధి నిర్వహించారు. అర్చకులు పారాయణాలు పఠించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

ఆరోగ్యానికి క్రీడలు దోహదం


మాట్లాడుతున్న డాక్టర్ మనోహర్

సింహాచలం: విద్యార్థులు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని రీజినల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్రస్థాయి అధికారి డాక్టర్ మనోహర్ సూచించారు. పాత పెందుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్‌ను ఆయన సోమవారం సందర్శించారు. ప్రతీరోజు గంట సమయం ఆటలకు కేటాయించాలని సూచించారు. క్రీడల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిస్తే స్పోర్ట్స్ కోటాలో ఉన్నత విద్య అభ్యసించడానికి, ఉద్యోగాలు పొందడానికి అవకాశం కలుగుతుందని తెలియజేశారు. సచిన్ టెండూల్కర్, వినోద్ కాంబ్లీ లను ఉదాహరణగా చెప్పి విద్యార్థుల్లో స్ఫూర్తి కలిగించారు. ప్రతీరోజు షూస్, యూనిఫాం, ఇన్‌షర్ట్ ధరించి పాఠశాలకు రావాలని, హెయిర్ కటింగ్ చక్కగా చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన బోధన విధానాలపై అధ్యాపకులకు శిక్షణ

అగనంపూడి: బోధనా విధానాలకు సాంకేతికతను జోడించి, అధ్యాపకులు మెరుగైన బోధనా పద్ధతులను అవలంబించాలని చెన్నై నిట్ ప్రొఫెసర్ వి.శివకుమార్ అన్నారు. 21వ శతాబ్దపు అధ్యాపకుల నూతన బోధనా విధానాలపై దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాల, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ టీచర్స్ ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐటీటీటీఆర్) సంయుక్తంగా నిర్వహించనున్న ఐదు రోజుల శిక్షణ తరగతులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫలితాల ఆధారిత విద్య, 21వ శతాబ్దపు పాఠ్యాంశాలు, 40 దేశాల్లో బోధనా రీతుల గురించి వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్, కో–ఆర్డినేటర్ వినోద్‌కుమార్, విజ్ఞాన్ రెక్టార్ వి.మధుసూదనరావు, ప్రిన్సిపాల్ బి.అరుంధతి, వైస్ ప్రిన్సిపాల్ కె.మధుసూదనరావు ప్రసంగించారు.

పార్కింగ్ స్థలంలో వ్యాపారం!


పార్కింగ్ స్థలంలో వ్యాపారం చేస్తున్న దృశ్యం

గోపాలపట్నం: ఎన్ఏడీ నుంచి మర్రిపాలెం వెళ్లే రోడ్డులో ఎన్ఏడీ ఫ్లైఓవర్ దిగువన పార్కింగ్ కోసం కేటాయించిన స్థలంలో వ్యాపారాలు చేస్తున్నారు. పైగా వాహనాలు నిలిపేందుకు యత్నిస్తే ఇక్కడి వ్యాపారులు అడ్డుకోవడంతో పాటు నానా దుర్భాషలాడుతున్నారని వాహనదారులు వాపోతున్నారు. ఇక్కడి ఫ్లైఓవర్ బ్రిడ్జి దిగువన నాలుగు బ్లాకులు ఉన్నాయి. అందులో రెండు బ్లాక్‌ల్లోనే వాహనాలు పార్కింగ్ చేసుకునే వెసులుబాటు ఉంది. వ్యాపారులకు దుకాణాలు ఉన్నా పార్కింగ్ స్థలంలో వ్యాపారాలు చేస్తుండడాన్ని స్థానికులు వ్యతిరేకిస్తున్నారు. దీనిపై జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ మూర్తిని వివరణ కోరగా ఈ వ్యాపారులు యూజర్ చార్జీలు మాత్రమే కడుతున్నారని... మరే విధమైన రుసుములు జీవీఎంసీకి కట్టడం లేదని తెలిపారు.

పరిశీలించి చర్యలు

పార్కింగ్ కోసం కేటాయించిన స్థలంలో వ్యాపారాలు చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. ఇది పార్కింగ్ స్థలమా కాదా అన్న విషయాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.
మళ్ల అప్పారావు, ట్రాఫిక్ సీఐ

బీటీ రోడ్డు వేయాలని వినతి

గోపాలపట్నం: కంపరపాలెం నుంచి మేహాద్రి గెడ్డ మీదుగా నరవ వెళ్లే మార్గాన్ని బీటీ రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరుతూ కంపర పాలెం నవభారతి యువజన సంఘం సభ్యులు జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావును కోరారు. ఈ మేరకు గోపాలపట్నంలో ఆయన ఇంటి వద్ద సోమవారం వినతిపత్రం అందించారు. నవభారతి సేవా సంఘం అధ్యక్షుడు కంపర రామకృష్ణ మాట్లాడుతూ సమస్యను జీవీఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పనులు ప్రారంభించేలా కృషి చేయాలని కోరారు. దీనికి స్పందించిన బెహరా భాస్కరరావు అధికారులతో కలిసి పరిశీలించి అంచనాలు తయారు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కంచిపాటి మురళి, కంపర కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రమాదకర చెట్ల కొమ్మల తొలగింపు


సాక్షి ఎఫెక్ట్..
చెట్ల కొమ్మలు తొలగిస్తున్న సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 55వ వార్డు జోగారావునగర్, యల్లబిల్లివారి వీధి, గంగన్ననగర్, కొత్త రెడ్డి కంచరపాలెం నుంచి కంచరపాలెం బీఆర్‌టీఎస్ నేతాజీ వంతెన జంక్షన్‌కు వెళ్లే రహదారుల్లో విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్ల కొమ్మలను ఎట్టకేలకు తొలగించారు. ఆయా ప్రాంతాల్లోని చెట్ల కొమ్మల్లో విద్యుత్ తీగలు చిక్కుకుని ప్రమాదకరంగా వేలాడుతున్నాయి. దీంతో అటుగా ప్రయాణించే పాదచారులు, వాహన చోదకులు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ సమస్యపై ఈ నెల 7న 'కరెంటు తీగలతో కలవరం' అనే శీర్షికన 'సాక్షి'లో వెలువడిన కథనానికి ఏపీఈపీడీసీఎల్ జోన్–2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు డీఈఈ కోటేశ్వరరావు, ఏఈ బి.వీర్రాజుల పర్యవేక్షణలో సిబ్బంది తొలగింపు చర్యలు చేపట్టారు.

గెడ్డల్లో పూడికల తొలగింపు


గొల్లకంచరపాలెం గెడ్డలో డెబ్రిస్ తొలగిస్తున్న సిబ్బంది, పర్యవేక్షిస్తున్న అధికారులు

కంచరపాలెం: జీవీఎంసీ 56,57 వార్డు కంచరపాలెం, ఊర్వశికూడలి, ఐటీఐకూడలి, 104 ఏరియా, ప్రాంతాల్లో గెడ్డల నిర్వహణపై 'సాక్షి'లో సోమవారం ప్రచురితమైన కథనానికి జీవీఎంసీ అధికారులు స్పందించారు. గొల్లకంచరపాలెం, తోటవీధి, దుర్గానగర్, గౌరీనగర్, సుభాష్‌నగర్, శ్యామ్‌నగర్ గెడ్డలు చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. దీంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై సోమవారం సాక్షి దినపత్రికలో ' గెడ్డల నిర్వహణ ఘోరం'! అనే కథనం వెలువడింది. దీంతో జోన్–5 కమిషనర్ ఆర్‌జీవీకృష్ణ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు పబ్లిక్‌హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ రాజేష్, సూపర్‌వైజర్ జనార్దన్ పర్యవేక్షణలో వార్డు శానిటరీ సిబ్బంది గెడ్డల్లో డెబ్రిస్, చెత్తా చెదారాలు తొలగించారు. జెడ్సీ కృష్ణ మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న రక్షణగోడల నిర్మాణానికి ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. గెడ్డల్లో చెత్తాచెదారాలు, డెబ్రిస్ వేసే వారిపై చర్యలు తీసుకోవాలని సచివాలయ శానిటరీ కార్యదర్శులు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్లను ఆదేశించినట్లు జెడ్సీ తెలిపారు.

ఎస్‌బీసీ బ్రిడ్జిపై రాకపోకలకు అనుమతివ్వాలి


సీఐటీయూ కార్యాలయం వద్ద పోస్టర్ విడుదల చేస్తున్న నాయకులు

మల్కాపురం: డాక్‌యార్డ్ బ్రిడ్జి మరమ్మతు పనులు పూర్తయ్యే వరకు ఎస్‌బీసీ వంతెనపై వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వాలని సీపీఎం మల్కాపురం జోన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. జీవీఎంసీ 61వ వార్డు వెంకన్నపాలెంలోని సీఐటీయూ కార్యాలయం వద్ద సోమవారం పోస్టర్ విడుదల చేశారు. జోన్ కార్యదర్శి పి.పైడిరాజు మాట్లాడుతూ మల్కాపురం,శ్రీహరిపురం,కోరమాండల్ తదితర ప్రాంత వాసులు నగరంలోకి రాకపోకలు సాగించేందుకు డాక్‌యార్డ్ వంతెన మార్గం దగ్గరగా ఉంటుందన్నారు. ఇప్పుడు ఆ వంతెన మరమ్మతుల కారణంగా రాకపోకలకు అనుమతులు లేవన్నారు.దీంతో వీడీఆర్ గోడౌన్స్ మీదుగా మారుతీ సర్కిల్ నుంచి చుట్టూ తిరిగి నగరానికి వెళ్లే పరిస్థితి ఉందన్నారు. దీని వల్ల శ్రమతో పాటు వాహనదారులకు ప్రయాణంలో అసౌకర్యం, ఒత్తిడి పెరుగుతోందన్నారు. వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని డాక్‌యార్డ్ వంతెన పక్కన గల ఎస్‌బీసీ వంతెన మార్గం వైపు రాకపోకలకు అనుమతులు ఇచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆర్.విమల,ఎ.సత్యారావు,ఆర్. దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

నాయకుడికి పరామర్శ


బాధితుడి యోగ క్షేమాలు తెలుసుకుంటున్న ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు,పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రతినిధి ఎం.పెంటారావు అనారోగ్యం కారణంగా కొద్దిరోజులుగా మంచం పట్టారు. విషయం తెలుసుకున్న పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, స్టాండింగ్ కమిటీ సభ్యుడు పి.వి.సురేష్, ఏఎంసీ చైర్మన్ ఆల్ఫా కృష్ణ, వార్డు కార్పొరేటర్ పుర్రె పూర్ణశ్రీయాదవ్ తదితరులు పెంటారావు ఇంటికి సోమవారం వెళ్లి ఆరోగ్య సమాచారం తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం


మాట్లాడుతున్న పశ్చిమ సమన్వయకర్త ఆనంద్‌కుమార్, చిత్రంలో ఎన్నికల పరిశీలకుడు ఎస్ఏ రెహ్మాన్, డిప్యూటీ మేయర్ జియ్యాని


పాల్గొన్న కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, నాయకులు

- ఎన్నికల పరిశీలకుడు ఎస్ఏ రెహ్మాన్
- దిశా నిర్దేశం చేసిన సమన్వయకర్త ఆనంద్ కుమార్

గోపాలపట్నం: పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా అందరూ సమన్వయంతో పని చేయాలని పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకుడు ఎస్ఏ రెహ్మాన్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్‌లోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అధ్యక్షతన నియోజకవర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. కొత్తగా నియమితులైన కన్వీనర్లకు పలు సూచనలు చేశారు. ఓటర్ లిస్టు ప్రకారం ఓటర్లను గుర్తించి వైఎస్సార్‌సీపీ బలపర్చిన సీతం రాజు సుధాకర్‌కు ఓటు వేసే విధంగా అభ్యర్థిచాలన్నారు. వార్డులు, బూత్‌ల వారీగా మెజారిటీ కనిపించాలన్నారు. కష్టపడే వారిని పార్టీ గుర్తిస్తుందని.. ఎన్నికలను ప్రతి ఒక్కరూ ప్రతిష్టాత్మకంగా పరిగణించాలని సూచించారు.
ఆడారి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ సమయం తక్కువగా ఉన్న నేపథ్యంలో అంతా చురుగ్గా పని చేయాలన్నారు. నియోజకవర్గం పని తీరు ఏంటో ఈ ఎన్నికల్లో చూపించాలన్నారు. బూత్‌ల వారీగా నియమించిన ఇన్‌చార్జిలతో కలిసి ఓటర్లను గుర్తించడంతో పాటు కలిసి ప్రచారం చేయాలని సూచించారు. ఇవి జనరల్ ఎన్నికలు కావని శ్రమతో కూడుకున్నవని ప్రణాళికా బద్ధంగా వెళ్తే సులువుగా ఓటరు వద్దకు చేరుకోగలమని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వైఎస్సార్ టీయూసీ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ బాకి శ్యామ్‌కుమార్ రెడ్డి, సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యురాలు శ్రీ దేవి వర్మ, కార్పొరేటర్లు ముర్రునానాజి, బల్ల లక్ష్మణరావు, వార్డు అధ్యక్షులు ఆడారి శ్రీనివాసరావు, అప్పలస్వామి నాయుడు, దొడ్డి కిరణ్, పుర్రె సురేష్, దాడి సత్యనారాయణ, వార్డు నాయకులు నమ్మి శ్రీను, సర్వసిద్ధి సాయిలత, గేదెల మురళీ కృష్ణ, అయితంశెట్టి కోటేశ్వరరావు, యల్లపు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అశోక్ దృష్టికి ట్రస్ట్‌బోర్డు అజెండా


అజెండా పరిశీలిస్తున్న అశోక్ గజపతిరాజు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సమావేశం మార్చి 1న నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ మేరకు అజెండాలోని అంశాలను తెలియజేస్తూ సోమవారం దేవస్థానం ఈవో త్రినాథరావు, ఈఈ శ్రీనివాసరాజు ట్రస్ట్ బోర్డు చైర్మన్ అశోక్‌గజపతిరాజుని విజయనగరంలోని స్వగృహంలో కలిశారు. మార్చిలో స్వామి వారి వార్షిక కల్యాణోత్సవం, ఏప్రిల్‌లో చందనోత్సవం నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు, అలాగే వివిధ పనులకు సంబంధించి సమారు 40 అంశాలతో దేవస్థానం అధికారులు అజెండా సిద్ధం చేశారు. ఈ మేరకు వాటిపై ముందస్తుగా చర్చ జరగాలని, ట్రస్ట్‌బోర్డు సమావేశం ఏర్పాటు చేయాలని సభ్యులు దినేష్ రాజ్, శ్రీదేవి, శ్రీనివాసరావు అధికారులకు సూచించిన విషయం తెలిసిందే. ఈ మేరకు అధికారులు సంబంధిత అంజెండాతో అశోక్‌గజపతిరాజును కలిశారు. ఈ మేరకు వచ్చే నెల 1న సమావేశం నిర్వహించేందుకు ఆయన గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది.

దొరకని మత్స్యకారుల ఆచూకీ

ఎంవీపీకాలనీ: సముద్రంలో గల్లంతైన ఉమ్మిడి అనిల్(23), మరుపల్లి ప్రవీణ్‌కుమార్ (22) ఆచూకీ లభించలేదు. ఆదివారం మధ్యాహ్నం నుంచి పోలీసులు గజ ఈతగాళ్లు, కోస్ట్ గార్డ్, నాటు బోట్లు సాయంతో పెద్ద ఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. ఏ క్షణంలోనైనా అనిల్, మరుపల్లి ప్రవీణ్ కుమార్‌ల ఆచూకీ లభిస్తుందని మత్స్యకార కుటుంబాలు ఆశగా ఎదురుచూశాయి. అయితే గాలింపు చర్యలు ముమ్మరంగా జరిగినప్పటికీ సోమవారం రాత్రి వరకు ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో కడసారి చూసుకోవాలని ఆవేదన చెందుతున్న కుటుంబ సభ్యులకు నిరాశే మిగిలింది. వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల సోమవారం సాయంత్రం బాధిత కుటుంబాలను పరామర్శించారు. గాలింపు చర్యలపై అధికారుల నుంచి ఆరా తీసిన ఆమె అనంతరం కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. కొద్దిసేపు వాసవానిపాలెం తీరంలో కుటుంబ సభ్యులతో పాటు గడిపిన ఆమె ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

విద్యార్థులు మెరైన్ సైంటిస్ట్‌లుగా రాణించాలి


ప్రత్యేక సంచికను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు అత్యుత్తమ మెరైన్ సైంటిస్ట్‌లుగా రాణించాలని ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు ఆకాంక్షించారు. ఏయూ సెంటర్ ఫర్ స్టడీస్ ఆన్ బే ఆఫ్ బెంగాల్, సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్(ఐఎన్‌కాయిస్) సంయుక్తంగా నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఉదయం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సమాచారం ప్రాధాన్యం, ఖచ్చితత్వం, డేటా మోడలింగ్ ఆవశ్యకతలను వివరించారు. ఇన్‌కాయిస్ శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణన్ నాయర్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఉన్న ఓషన్ అబ్జర్వేషన్ సిస్టమ్ పనితీరును తెలియజేశారు. సునామీలను ముందస్తుగా గుర్తించడం, అత్యధికంగా మత్స్య సంపద కలిగి ఉండే ప్రాంతాల గుర్తించి మత్స్యకారులకు తెలియజేయడంలో నూతనంగా అభివృద్ధి చేసిన విధానాలు, వ్యవస్థలను వివరించారు. గంగవరం పోర్టు పూర్వ హార్బర్ మాస్టర్ కెప్టెన్ మహంతి మాట్లాడుతూ ముందస్తు అంచనాలు ఇవ్వడంలో ఖచ్చితత్వాన్ని కలిగి ఉండడం ఎంతో ప్రధానమని సూచించారు. సీఎస్‌బీవోబీ డైరెక్టర్ ఆచార్య పి.రామారావు, సీనియర్ ఆచార్యుడు పి.రాజేంద్రప్రసాద్, జియో ఫిజిక్స్ ఆచార్యుడు బి.ఆనందగజపతిరాజు తదితరులు ప్రసంగించారు. 35 మంది యువ శాస్త్రవేత్తలు, వివిధ విద్యా సంస్థలు, పరిశోధన కేంద్రాల ప్రతినిధులు 16 మంది ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రమాద రహిత నిర్వహణే లక్ష్యం



భద్రతా వారోత్సవాల్లో ప్రసంగిస్తున్న స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ బాగ్చీ

ఉక్కునగరం: శూన్య ప్రమాదాలు లక్ష్యంగా స్టీల్‌ప్లాంట్ ముందుకు సాగాలని ప్లాంట్ డైరెక్టర్ (ఆపరేషన్స్) ఇన్‌చార్జి అరుణ్ కాంతి బాగ్చీ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్ సెంట్రల్ మెయింటెనెన్స్ మెకానికల్ (సీఎంఎం) విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన భద్రతా వారోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. భద్రతా పని విధానంలో విశాఖ స్టీల్‌ప్లాంట్ దేశీయ ఉక్కు పరిశ్రమల్లో ఉన్నత స్థానంలో ఉందన్నారు. వారోత్సవాలు నిర్వహించడం మాత్రమే కాకుండా, భద్రతా పరిస్థితులు మరింత మెరుగుపర్చేందుకు వినియోగించాలని కోరారు. క్లిష్టమైన పని ప్రదేశాల్లో భద్రతా పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ముందుకు సాగాలన్నారు. సీజీఎం (వర్క్స్) ఇన్‌చార్జ్ బి.కె. మొహంతి మాట్లాడుతూ ప్లాంట్ యంత్రాల నిర్వహణలో సీఎంఎం విభాగం చేస్తున్న కృషి ఎనలేనిదన్నారు. సీజీఎం (సేఫ్టీ అండ్ ఎన్విరాన్‌మెంట్) ఎం.ఎస్.వి. కృష్ణయ్య మాట్లాడుతూ ప్రతీ ఉద్యోగి భద్రతతో కూడిన పని విధానం అవలంబించాలని కోరారు. సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ నవీన్‌కుమార్, భద్రతా విభాగాధిపతి ఎన్.కె. రౌత్, నాయకులు కె.వి.డి. ప్రసాద్, కె.ఎస్.ఎన్. రావు, అయోధ్య రామ్, మంత్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం


జీలకర్రబెల్లం ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30 నుంచి కల్యాణ ఘట్టం ప్రారంభమైంది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

20 నుంచి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు



పరీక్షల వివరాలు విడుదల చేస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ట్రాన్స్ డిసిప్లినరీ రీసెర్చ్ హబ్‌లో ప్రవేశం పొందిన వారికి మార్చి 20 నుంచి ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహించనున్నట్లు ఏయూ టీడీఆర్ హబ్ డీన్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ తెలియజేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమ వారం ఏయూ వీసీ ఆచార్య పీవీజీడీ ప్రసాద రెడ్డి విడుదల చేశారు. ప్రీ పీహెచ్‌డీ పరీక్షకు ఈ నెల 28లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏయూ టీడీఆర్ వెబ్‌సైటులో సంబంధిత వివరాలు నమోదు చేసి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని, సబ్జెక్టుల వారీగా పరీక్ష తేదీలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

దళిత సేన నిరసన


నిరసన తెలుపుతున్న దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు, ప్రతినిధులు

కంచరపాలెం: ఉత్తరాంధ్ర ఆరోగ్య ప్రదాయిని కేజీహెచ్ నుంచి మృత శిశువుతో ద్విచక్ర వాహనంపై గిరిజన కుటుంబీకులు వెళ్లిన అమానుష ఘటనపై దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఊర్వశి జంక్షన్‌లోని దళిత సేన కార్యాలయంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్టీల కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసినప్పటికీ కనీసం అంబులెన్స్ సౌకర్యం కల్పించని దుశ్చర్యను దళిత సేన తీవ్రంగా ఖండిస్తోందన్నారు. సమాచార లోపం కారణంగా గిరిజనులకు అవస్థలు తప్పడం లేదని పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఎస్టీ సెల్‌ను పునరుద్ధరించాలని అప్పారావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దళిత సేన నగర కన్వీనర్ గొల్లమాల మీనా, పుచ్చా కామేశ్వరరావు, తాటిపూడి సీతారాం, పట్నాల ఝాన్సీ, రాణి, జయకుమార్, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

739వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు


దీక్షలో పాల్గొన్న సీవో, సీసీపీ విభాగ కార్మికులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగార అమ్మకపు ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 739వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన సీవో, సీసీపీ విభాగ కార్మికులు పాల్గొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును అమ్మేస్తానని ప్రకటనలు చేయడం సరికాదన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని దేశప్రజలు, కార్మికవర్గం, సంస్థకు భూములిచ్చిన నిర్వాసితులు గట్టి పట్టుదలతో ఉన్నారన్నారు. కనుక, కేంద్ర ప్రభుత్వం చేసే ప్రకటనలతో బెదిరేది లేదన్నారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

సింహాచలం: ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ విశాఖ జిల్లా క్యాలెండర్‌ను సోమవారం పెందుర్తి ఎంపీడీవో వెంకటరావు తన కార్యాలయంలో ఆవిష్కరించారు. గ్రామ స్వరాజ్యం లక్ష్యంగా సచివాలయ ఉద్యోగులంతా కష్టపడి పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.